క్లుప్తంగా

రెండు మండలాల్లో మోస్తరు వర్షం

సీఎస్‌పురం(పామూరు): పామూరు, సీఎస్ పురం మండల కేంద్రాలతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అంతరాయంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగా తీవ్ర ఎండతో అల్లాడిన ప్రజలకు వర్షం కొంతమేర ఊరటనిచ్చింది.

లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజలు



సీతారాములని లక్ష మల్లెపూలతో అలంకరణ

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కోదండరామస్వామి దేవస్థానంలో మంగళవారం సీతాదేవి అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల వారిని లక్ష మల్లెపూలతో ప్రత్యేక పూజలు చేసి 11 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్యంతో స్వచ్ఛ గ్రామాలు



పామూరులో పారిశుధ్యంపై వివరిస్తున్న కళాజాత సభ్యులు

పామూరు: మెరుగైన పారిశుధ్యంతో స్వచ్ఛ గ్రామాల నిర్మాణం సాధ్యమని ఈఓపీఆర్‌డీ జి.అరవిందారెడ్డి అన్నారు. పరిసరాల పరిశుభ్రత, అంటువ్యాధుల నియంత్రణపై మంగళవారం కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాజాత సమితీవారు ప్రతి ఒక్కరూ నివాసాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి వద్దే తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా వేయించి సేకరణ చేయాలని, ప్లాస్టిక్ కవర్ల నిషేధం, వస్తువుల వినియోగం తగ్గించడం, దోమల నివారణ, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన పాటలు, ప్రదర్శన ద్వారా వివరించారు. పంచాయతీ సిబ్బంది రత్నకుమార్, పీఎస్ రజనీకాంత్, క్రిష్ణవేణి, ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో తిప్పతీగ వేయాలి



షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకరశర్మ


పీసీపల్లి: మండల పరిధిలోని మరెళ్లలో ఐవీఆర్ఎస్ మోడల్ షెడ్‌ను ఎంపీడీఓ ప్రభాకరశర్మ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రంలో తిప్పతీగ తప్పనిసరిగా వేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు పరిశీలించారు. గ్రామంలో కూలికి వెళుతున్న వారికే మస్టర్ వేయాలని, బయట వారికి వేస్తే చర్యలు తప్పవన్నారు. సర్పంచ్ పరిమి వెంకట్రావు, రాంప్రసాద్, పంచాయతీ కార్యదర్శి షర్మిల తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మంగారి తిరునాళ్ల



వీరబ్రహ్మేంద్ర స్వామి మూలవిరాట్

పీసీపల్లి: మండల పరిధిలోని పడమటపల్లిలో వెలసిన మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.



విద్యుత్ కాంతులతో బ్రహ్మంగారి గుడి

ఊరెళ్తున్నారా...ఊడ్చేస్తారు!



టంగుటూరులో చోరీ జరిన ఇంట్లో పరిశీలిస్తున్న ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు(ఫైల్)



టంగుటూరులో చోరీ జరిగిన ఇల్లు

- తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తున్న దొంగలు
- రాత్రిళ్లే కాదు..పట్టపగలూ చోరీ
- సమాచారం ఇస్తే నిఘా పెడతామంటున్న పోలీసులు

టంగుటూరు:

పిల్లలకు వేసవి సెలవిచ్చేశారు..దీంతో విహార యాత్రలు, తీర్థయాత్రలు, పెళ్లిళ్లు, ఫంక్షన్లకు ఇంటిల్లిపాది తాళాలు వేసుకొని వెళ్లిపోతున్నారు. ఇదే అదునుగా చేసుకొని దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని దోపిడీ చేస్తున్నారు. రాత్రిళ్లే కాదు..పక్కాగా ప్లాన్ చేసి పగలు చోరీలు చేస్తున్నారు.

9 నెలల్లో 62 చోరీలు..

సింగరాయకొండ సర్కిల్‌లోని టంగుటూరు, జరగుమల్లి, సింగరాయకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గడిచిన 9 నెలల్లో 62 దొంగతనాలు జరిగాయి. దుండగులు రూ.1.27 కోట్ల విలువైన సొత్తును అపహరించారు. ఇందులో పోలీసులు 40 కేసులను ఛేదించి రూ.కోటి విలువైన సొత్తు రికవరీ చేశారు. మిగిలిన కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ

ఈ ఏడాది జనవరి 26న ఒకే రోజు మూడు ఇళ్లలో ఒకే తరహాలో చోరీలు జరిగాయి.

☛ టంగుటూరులో నివాసం ఉండే దామచర్ల హనుమాయమ్మ తూర్పునాయుడుపాలెంలో కుమారుడు ఇంటికి వెళ్లింది. ప్రధాన గేటుకి తాళం వేసి ఉండగా గోడ దూకి రాడ్డు సహాయంతో తలుపు పగలగొట్టి బీరువాలోని 17 సవర్ల బంగారు ఆభరణాలు, కేజీ వెండి, రూ.20 వేల నగదు అపహరించారు.

☛ టంగుటూరు వెటర్నరీ ఆసుపత్రి సమీపంలో ఉండే బెల్లం రామయ్య గత సోమవారం ఇంటికి తాళాలు వేసి పని నిమిత్తం వైజాగ్ వెళ్లగా దుండగలు తలుపులు తలగొట్టి బీరువాలోని 19 సవర్ల బంగారు ఆభరణాలు, 5 కేజీల వెండి, రూ.50 వేల నగదుతో ఉడాయించారు.

☛ టంగుటూరు విష్ణాలయం సమీపంలో నివాసం ఉంటున్న మాజీ ఏపీజీబి బ్యాంకు మేనేజర్ పత్తిపాటి బ్రహ్మానందం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి మరుసటి రోజు వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని రూ.15 వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు.

☛ అలాగే సింగరాయకొండ బైరాగి మాన్యంలో నివాసం ఉంటున్న రాజు సుబ్బారెడ్డి మార్చి 5వ తేదీన కుటుం సభ్యులతో కలిసి కాశీ వెళ్లారు. దొంగలు ఇంటి ప్రధాన ద్వారం ధ్వంసం చేసి వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదు అపహరించారు. అయితే సీక్రెట్ లాకర్‌లో ఉన్న 60 సవర్ల బంగారు ఆభరణాలు భద్రంగా ఉన్నాయి.

పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలి ...

సెలవుల్లో వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇస్తే రాత్రిళ్లు ఆ ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తారు. తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వేసవిలో ఉక్కపోతతో ఇళ్లలో ఉన్న వారంతా ఆరుబయట నిద్రించేందుకు ఆసక్తి చూపుతారు. వీరంతా వారి ఇళ్లలో వీలైనంత మేరకు విలువైన వస్తువులను బ్యాంకుల్లో భద్రపరిస్తే మంచిది. ఆయాప్రాంతాల్లో రాత్రి పూట గస్తీ నిర్వహించే పోలీసు సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలి. యువత అప్రమత్తంగా వ్యవహరించి ఎటువంటి సంఘటనలు జరిగినా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి.

పోలీసుస్టేషన్లో సమాచారం ఇవ్వాలి



విహారయాత్రలు, బంధువుల ఇళ్లకు వెళ్లే వారు స్థానిక పోలీసుస్టేషన్లో సమాచారం అందిస్తే ఆ ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూస్తాం. కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనిపిస్తే ఫోన్‌లో ఫొటోలు తీసుకోవాలి. వేసవిలో ఉక్కపోత పోస్తుంటే ఆరు బయట పడుకునే వారు అప్రమత్తంగా ఉండాలి.

– ఎస్సై నాగమల్లేశ్వరరావు, ఎస్సై, టంగుటూరు

విలువైన వస్తువులు బ్యాంకుల్లో భద్రపరుచుకోండి



ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు తమ బంగారు ఆభరణాలు, నగదును బీరువాల్లో ఉంచుకోరాదు. దొంగల టార్గెట్ బీరువాలపైనే ఉంటుంది. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. బంగారు ఆభరణాలు, నగదులు బ్యాంకుల్లో లేదా ఇంట్లో ఇతర ప్రాంతాల్లో దాచుకోవాలి. ప్రజలు ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే సింగరాయకొండ సీఐ– 9121102135, టంగుటూరు ఎస్సై – 9121102137, జరుగుమల్లి ఎస్సై 9121102138, సింగాయకొండ ఎస్సై 9121102136 నంబర్లకు సమాచారం అందివ్వాలి.

–సీఐ చావా హజరత్తయ్య, సింగరాయకొండ

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

పామూరు: ఈనెల 20వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ, సివిల్‌సప్లయ్ ముఠా కార్మికులకు కనీస వేతం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ సార్వత్రిక సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం అంగన్‌వాడీ, ఆశ, పంచాయతీ, సివిల్‌సప్లయ్ ముఠా కార్మికులు ఆయాశాఖల అధికారులకు సమ్మెనోటీసులు అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్‌ఆర్‌డి జి.అరవిందారెడ్డికి సమ్మెనోటీసు అందజేశారు.

టంగుటూరు: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశాకార్యకర్తలు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బాలాజీకి, వీఆర్‌ఏలు తహసీల్దార్ ఆంజనేయులకు, టోల్‌ప్లాజా కార్మికులు అధికారులకు సమ్మె నోటీసు అందజేశఆరు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమ్మెకు దిగుతున్నామన్నారు. సీఐటీయూ నాయకులు టి.రాము, వి. మోజెస్, ఆశాలు సుభాషిణి, కృష్ణవేణి, కామేశ్వరి, సుజాత, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: ఈనెల 20న జరిగే జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సీఐటీయూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుందన్నారు. మోడీ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ.. దేశవ్యాప్తంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గాలన్ని పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరేంద్ర, సీహెచ్ ప్రసాద్, ఏడుకొండలు, ప్రసన్న, శాంత కుమారి, యు పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కొనుగోళ్లు చేస్తే చర్యలు



వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: పొగాకు అక్రమ కొనుగోళ్లు చేస్తే వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో ఆలకూరపాడు, రావివారిపాలెం, పొలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకు చెందిన రైతులు 791 బేళ్లను వేలానికి తీసుకురాగా 616 బేళ్లను కొనుగోలు చేసి 175 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.215, సరాసరి రూ.254.03 పలికింది. వేలంలో 20 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వేలంలో 946 బేళ్లను కొనుగోలు చేసినట్లు నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. ముప్పవరం, చోడవరం గ్రామాలకు చెందిన రైతులు 1072 బేళ్లను తీసుకురాగా 126 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధరరూ.280, కనిష్ట ధర రూ.210, సరాసరి ధర రూ.259.30 పలికింది. వేలంలో 18 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి



పొన్నలూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

పొన్నలూరు: కిశోర బాలికలు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. పొన్నలూరు అంబేడ్కర్ నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసంలో భాగంగా కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు పటిష్టమైన ఆరోగ్యంతో ఉండాలంటే ఈ దశ నుంచే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కిశోర బాలికలు చదువు కోవాల్సిన వయస్సులో చెడు వ్యసనాలకు, ఆకర్షణలకు గురికాకుండా ఉన్నతంగా చదవాలన్నారు. అలాగే బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల బాలికల బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మహిళా పోలీస్ స్వర్ణలత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తగా విధులు నిర్వర్తించండి



ట్రాఫిక్ సిబ్బందికి వైట్ హ్యాట్, కూలింగ్ గ్లాసను అందచేస్తున్న డీఎస్పీ

కనిగిరిరూరల్: పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి మంగళవారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ వైట్ హ్యాట్, కూలింగ్ గ్లాస్ అందచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ మాట్లాడుతూ ఎండ, వేడి, వడ దెబ్బ నుంచి తమను తాము రక్షించు కునేందుకు ట్రాఫిక్ సిబ్బందికి ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, విధి నిర్వహణను బాధ్యతగా నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందిని అభినందించారు. ట్రాఫిక్ నిర్వహణలో ప్రజల మన్ననలను పొందాలని ఆకాంక్షించారు. సీఐ ఖాజావలి, ఎస్సై టీ శ్రీరాం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో స్కీములన్నీ స్కామ్‌లే

- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బొట్ల సుబ్బారావు, ఇతర నేతలు

కొండపి: కూటమి ప్రభుత్వంలో ప్రతి స్కీమ్‌లోనూ రూ.కోట్లలో స్కాంలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు అన్నారు. బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ, ఇతర అవకతవకలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ రామకృష్ణకు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఇసుక స్కామ్, భూముల స్కామ్, మైనింగ్ స్కామ్ ఏదో ఒక కుంభకోణం జరుగుతూనే ఉన్నాయని విమర్శించారు. కూటమిలోని కీలక నేతలు అధికారులతో కలిసి ఆఖరికి మహిళల టైలరింగ్ కుట్టు మిషన్ల కూడా వదల్లేదని ఎద్దేవా చేశారు. రూ.257 కోట్ల కుట్టు మిషన్ల స్కీంలో రూ.150 కోట్ల వరకు కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కుట్టుమిషన్ల పంపిణీ, శిక్షణలో భాగంగా ప్రతి ఒక్కరికీ రూ.23 వేలు కేటాయించారని, కానీ రూ.4,300 విలువైన నాసిరకమైన కుట్టుమిషన్లు, శిక్షణకు అయ్యే ఖర్చు రూ.3 వేలు మాత్రమే అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారన్నారు. అనంతరం టైలరింగ్ శిక్షణను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు, జిల్లా బూత్ లెవెల్ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకట్రావు, బీసీ సెల్ సెక్రటరీ తన్నీరు వీరనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యనమల మాధవి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు షేక్ వన్నూరు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ రావూరి ప్రభావతి, పర్చూరు సుబ్బయ్య, సుబ్బు, మిట్ట సాంబశివరావు, రామయ్య, నజీర్, కోడిపిల్ల ప్రసాద్, బాలిశెట్టి కొర్నేలు, రావులపల్లి శివకృష్ణ, అజయ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

సీఎస్‌పురం(పామూరు): బాల్య వివాహాలను నియంత్రించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐసీపీఎస్ లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ కె.దేవకృపావరం అధ్యక్షతన మహిళా పోలీసులు, ఎంపీహెచ్, అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, వీఓఏలకు కిశోర వికాసంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఆఫీసర్ రత్నప్రసాద్, డాక్టర్ హోమద్యుతిలు మాట్లాడుతూ కిశోరవికాసం కార్యక్రమం వారంలో రెండు రోజులు మంగళవారం, శుక్రవారం రోజుల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ఐదుగురు కమిటీ సభ్యులు కిశోర బాలికలను గుర్తించి 10 నుంచి 15 మందిని గ్రూపుగా చేసి వ్యక్తిగత పరిశుభ్రత, నైతిక విలువలు, ట్రాఫికింగ్, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ లైంగిక వేధింపులు మొదలైన వాటిపై అవగాహన చేయాలన్నారు. కార్యక్రమంలో స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు డాక్టర్ షేక్.నాయబ్‌రసూల్, మహిళాపోలీసులు, ఏఎన్‌యంలు, వీఓఏలు, ఆశాలు పాల్గొన్నారు.

చదువుల తల్లికి సన్మానం



భార్గవిని సన్మానిస్తున్న బొడ్డు వెంకటేశ్వరరావు

టంగుటూరు: పదోతరగతి పరీక్షల్లో 595 మార్కులు సాధించిన ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పుట్టా వెంకట భార్గవిని స్ఫూర్తి స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ సలహాదారులు, ఇన్‌కంట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ బొడ్డు వెంకటేశ్వరరావు మంగళవారం ఘనంగా సన్మానించి ప్రోత్సాహక నగదు అందజేశారు. అదే విధంగా ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డి, ఆలం రామారావు, వేణు, ఉపాధ్యాయులను పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించి రూ.10 వేల నగదు అందజేశారు.

కారును ఢీకొట్టిన ట్యాంకర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఉలవపాడు: కారు ఆపి మామిడి కాయలు కొనడానికి దిగిన తరువాత ఆ కారును ట్యాంకర్ ఢీ కొన్న ఘటన జాతీయ రహదారిపై వీరేపల్లి జంక్షన్ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. అందిన వివరాల మేరకు.. కావలి నుంచి నరసరావుపేటకు ఇద్దరు వ్యక్తులు కారులో వెళ్తూ వీరేపల్లి వద్ద మామిడి కాయల దుకాణాలు చూసి కారు రోడ్డుపై ఆపి దిగి కాయలు కొంటున్నారు. ఇదే సమయంలో ఒంగోలు వైపు వస్తున్న ట్యాంకర్ కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కారు బాగా దెబ్బతినింది. కారు కూడా ఢీకొన్న వెంటనే దుకాణం దగ్గరకు వచ్చి నిలిచిపోయింది. ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. రోడ్ సేఫ్టీ అధికారులు వచ్చి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలులుకు రాలిన మామిడి కాయలు



మహమ్మదాపురంలో రాలిన మామిడి కాయలు



విరిగిపడిన మామిడి చెట్ల కొమ్మలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వేములపాడు, మహ్మదాపురం, రాజుగారిపల్లి గ్రామాల పరిధిలో రెండు రోజుల పాటు వీచిన ఈదురుగాలులకు మామిడి, నిమ్మ తోట రైతులకు నష్టం వాటిల్లింది. మహ్మదాపురం గ్రామానికి చెందిన కాలంగి కొండయ్య మహ్మదాపురం రెవెన్యూలో 27 ఎకరాల్లో మామిడి సాగు చేశాడు. పంట కోత దశలో ఉండగా అకాల వర్షం, తీవ్రమైన గాలులకు చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో కాయ, పిందె రాలి కిందపడ్డాయి. చెట్లకు ఉన్న కాయలు 80 శాతం రాలిపడ్డాయని రైతు కొండయ్య వాపోయాడు. ఉద్యానవన శాఖాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు



మట్టి నమూనా సేకరణపై శిక్షణ ఇస్తున్న ఏడీఏ, ఏఓ

పామూరు: భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేసుకుని అధిక దిగుబడులు పొందాలని ఏడీఏ ఎ.వెంకటరమణ అన్నారు. మండలంలోని దూబగుంట్ల రైతు సేవా కేంద్రం పరిధిలోని వెంకటాపురంలో మంగళవారం రైతులకు భూసార పరీక్షల ఆవశ్యకత, ఆర్‌బీకే సిబ్బందికి మట్టి నమూనా సేకరణపై శిక్షణ నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ మొత్తం 1058 మట్టి నమూనాలు సేకరించాల్సి ఉందని, ఒక్కో రైతు సేవాకేంద్రం పరిధిలో కనీసం 60 మట్టి నమూనాలు సేకరించనున్నట్లు తెలిపారు. రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి, రైతులకు, ఆర్బీకే సిబ్బందికి మట్టి నమూనాలు సేరించే విధానం గురించి వివరించి క్షేత్రస్థాయిలో నమూనాద్వారా చేసి చూపారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటంవల్ల ఖర్చులు తగ్గించుకోవడమే కాక సూక్ష్మ పోషక లోపాలు సవరించడం వల్ల నాణ్యమైన పంట దిగుబడులు పొందవచ్చన్నారు. ఏఓ కంచం రాధ, ఏఈఓ నగేష్, వీఏఏ బి.అవినాష్, మాజీ సర్పంచ్ పోతురాజు వెంకట్రావు, పలువురు పాల్గొన్నారు.